ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

ఆలూర్‌లో తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టిన దృశ్యం

ఆలూర్, మే18: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఏర్పడడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు కురవడంతో ధాన్యం తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కంఠేశ్వర్, మే 18 : అకాలవర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తడంతో రైతులు నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు కోరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టాన్ని అధికారులు అంచనా వేసి, నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

వినాయక్‌నగర్, మే 18 : జిల్లాకేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద పోలీసు వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టగా ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వినాయకనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై శనివారం ధర్నాచౌక్ వైపు నుంచి వస్తుండగా వెనకాల నుంచి వచ్చిన పోలీస్ వాహనం ఢీకొట్టింది. సదరు వ్యక్తి ద్విచక్రవాహనం పైనుంచి కింద పడడంతో అతడి తలకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన పోలీస్ వాహనంలో ప్రయాణిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారిణి వెంటనే క్షతగాత్రుడిని అదేవాహనంలో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గాయపడిన వ్యక్తికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పినట్లు సమాచారం.

రెడ్డి కార్పొరేషన్ జీవో విడుదల చేయాలని వినతి

కంఠేశ్వర్, మే 18 : సీఎం రేవంత్‌రెడ్డి పేదరెడ్డి సామాజికవర్గానికి ప్రకటించిన కార్పొరేషన్ విధి విధానాలు, పాలకవర్గం కోసం అధికారికంగా జీవో విడుదల చేయాలని ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం కలిశారు. ఈ విషయమై క్యాబినేట్ సమావేశంలో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య వేదిక స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీ క్యాంతం శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి

మోర్తాడ్‌లో అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న అధ్యాపకులు

మోర్తాడ్, మే18: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని కోరుతూ అధ్యాపకులు శనివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఇప్పటి వరకు కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లో అడ్మిషన్‌డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు.

కలగా మిగిలిన ఆర్‌వోబీ నిర్మాణం

- నాలుగేండ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- రోజుకు 52 రైళ్ల రాకపోకలు
- 20 నిమిషాలకు ఒకసారి ట్రాఫిక్‌కు అంతరాయం
- బాసర వెళ్లే భక్తులకు తప్పని తిప్పలు

నవీపేటలో రైల్వే గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

నవీపేట, మే 18: మండల కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. మండల ప్రజలతోపాటు బాసర వెళ్లే భక్తులకు రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఎంపీ ధర్మపురి అర్వింద్ నిర్లక్ష్యం కారణంగా నాలుగేండ్లగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు నోచుకోలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో బాసర ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన మ్యాన్ లేవల్(188) రైల్వేగేటు మార్గం ద్వారా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి రోజూ 52 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి రైల్వేగేటు మూసివేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అంబులెన్స్‌లో గర్భిణులతోపాటు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సమయానికి దవాఖానకు చేర్చలేక పోతున్నారు.

కొన్ని సార్లు గర్భిణులు అంబులెన్స్‌లలోనే ప్రసవం అయిన సందర్భాలున్నాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని రైళ్లు సాంకేతిక లోపంతో ట్రాక్‌పై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడవందో గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. రైల్ వెళ్లిన అనంతరం స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు గంటకుపైగా శ్రమ పడాల్సి వస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాసర వెళ్లే భక్తుల సౌరర్యార్థం రూ.55 కోట్ల వ్యయంతో ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఈ మార్గం గుండా నిత్యం నిమిషానికి 30 వాహనాలు, గంటకు 1800, రోజుకు 43,200 వివిధ రకాలు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

పట్టించుకోని ఎంపీ అర్వింద్

ఐదేండ్లపాటు ఎంపీగా కొనసాగిన ధర్మపురి అర్వింద్ ఆర్‌వోబీ నిర్మాణానికి కృషి చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగేండ్ల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు ఆర్‌వోబీ మంజూరుకు ప్రతి పాదనలు పంపినా ఆయన నిర్లక్ష్యం కారణంగా మంజూరుకు నోచుకోలేదని ప్రజలు అంటున్నారు.

నవీపేటలో ఆర్‌వోబీ ఎంతో అవసరం

మండల కేంద్రంలో బాసర ప్రధాన రోడ్డుపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎంతో అవసరం. రైల్వే గేటు పడినప్పుడల్లా ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనాలదారులు, విద్యార్థులు, ఉద్యోగులు తంటాలు పడుతున్నారు. కొన్నిసార్లు 20 నిమిషాల వరకు గేటు తెరుచుకోదు. నిత్యం నేను బస్సులో వస్తుంటాను. రైల్వేగేటు మూసివేయగానే బస్సులో నుంచి దిగి పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుంటాను. వెంటనే ఆర్‌వోబీ మంజూరు చేయాలి.

- రాధ, ఉపాధ్యాయురాలు, నవీపేట

ఎంపీ అర్వింద్ నిర్లక్ష్యం

ఐదేండ్ల పాటు అధికారంలో ఉన్న ఎంపీ ధర్మపురి అర్వింద్ నవీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి గురించి పట్టించుకోలేదు. ఈ మార్గం గుండా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్‌వోబీ నిర్మాణం కోసం నాలుగేండ్ల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఎంపీ అర్వింద్ పట్టించుకోకపోవడంతో మంజూరుకు నోచుకోలేదు. వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు.

- తెడ్డు పోశెట్టి, మాజీ ఉప సర్పంచ్, నవీపేట

ప్రతిపాదనలు పంపించాం

నవీపేట మండల కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.55 కోట్లతో జాన్కంపేట్ నుంచి ఫకీరాబాద్ వరకు 14 కిలోమీటర్ల పొడవునా ఫోర్‌లేన్ రహదారి నిర్మించింది. దీంతో బాసర జ్ఞాన సరస్వతీ ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

-హన్మంత్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నిజామాబాద్

సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

కాంగ్రెస్ అంటే రైతు భక్ష పార్టీ

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, మే 18 : కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తున్నదని, కాంగ్రెస్ అంటేనే రైతు భక్ష పార్టీఅని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే తెలంగాణ ప్రజలపై ఆర్,ఆర్ (రాహుల్,రేవంత్) టాక్స్ విధిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. కొత్తగా యూ (ఉత్తమ్‌కుమార్) టాక్స్ కూడా పెట్టారని ఎద్దేవాచేశారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నవడ్లకే అనడం కాంగ్రెస్ మాటల గారడికి నిదర్శనమని అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉన్నదని, ఎన్నికల కోడ్ ముగియగానే శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.



సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న రీజినల్ మేనేజర్ జానీరెడ్డి

బోధన్ డిపో తనిఖీ

బోధన్, మే 18: పట్టణంలోని ఆర్టీసీ డిపోను శనివారం ఆ సంస్థ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తనిఖీ చేశారు. ఆర్టీసీలో ప్రస్తుతం కొనసాగుతున్న 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0' కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కార్మికులకు వైద్య పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ఆర్టీసీ కార్మికులను వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ శ్రీనివాస్, ఇతర డిపో అధికారులు ఉన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు

ఖిలీల్‌వాడి, మే 18 : రెండో త్రైమాసిక ప్రగతి చక్రం అవార్డులను డ్రైవర్లు, కండక్టర్లకు రీజినల్ పరిధిలో శనివారం ఆర్ఎం జానిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి, శంకర్, కండక్టర్స్, డ్రైవర్లు పాల్గొనగా వారికి అవార్డులను అందజేశామన్నారు.

రైతులు జీఎస్టీ నంబర్ ఉన్న రసీదునే తీసుకోవాలి

బోధన్ రూరల్, మే18: విత్తనాల కొనుగోలు చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. జీఎస్టీ నంబర్ ఉన్న రసీదు మాత్రమే తీసుకోవాలని, రసీదుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం పేరు, లాట్ నంబర్, గడువు తేదీ, డీలర్ సంతకం తప్పని సరిగా తీసుకోవాలన్నారు. దుకాణదారు ఇచ్చిన బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. జన్యు, స్వచ్ఛతలోపాలు, మొలకశాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు.

చెన్న శంకర్‌కు సహస్ర చిమ్మీ శేఖర పురస్కారం

సుభాష్‌నగర్, మే 18 : జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ కవి చెన్న శంకర్‌కు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రీ హంసవాహిని సాహిత్య కళాపీఠం వారు సహస్ర చిమ్మీ శేఖర పురస్కారాన్ని (2024) శనివారం ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. చెన్నశంకర్ మూడు దశాబ్దాలుగా వెయ్యి కవితలు పూర్తిచేసినందుకు పురస్కారానికి ఎంపిక చేశామని కళాపీఠం నిర్వాహకుడు చిమ్మీల రూపకర్త జాదవ్ పుండలీక్ రావు పాటిల్, కళాపీఠం కార్యదర్శి మీసర శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చెన్న శంకర్‌ను జిల్లా కవులు అభినందించారు.

పాఠశాలల పునఃప్రారంభంలోపు యూనిఫామ్‌లు అందజేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

డిచ్‌పల్లి, మే 18 : పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో జిల్లా సమాఖ్య సమావేశాన్ని శనివారం నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు యూనిఫామ్‌లు కుట్టిస్తున్నారని, వీటిని సకాలంలో విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత మహిళా సంఘాల సభ్యులపై ఉందని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ నిర్మాణ పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు శ్రీనివాస్, సంధ్య, నీలిమ, మారుతి, సాయిలు, రాందాస్, ఏపీఎం సరోజిని, కల్చరల్ కో-ఆర్డినేటర్ గంగాధర్, రాధ, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పూడికతీత పనులు

పూడికతీత పనులు చేపడుతున్న రైతులు

మోస్రా (చందూర్), మే 18: మండలంలోని గోవూర్ గ్రామంలో చెరువు కాలువ పూడికతీత పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని చెరువు కింద 180 ఎకరాలు ఆయకట్టు ఉన్నది. కొన్నేండ్లుగా ఆయకట్టు మీదుగా పలు కాలువల ద్వారా ఎక్కువైన నీరు బోధన్ బెల్లాల్ చెరువుకు వెళ్లేది. కాలువను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురైంది. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి కాలువ మూసుకుపోయింది. భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులో నీరు నిండగా.. మిగతా వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేది. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల గ్రామ పర్యటనకు రాగా..ఆయకట్టు రైతులతో కలిసి సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నదాతల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పోచారం ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, సమస్యను ప్రభుత్వానికి విన్నవించి నిధులు మంజూరు చేసే సరికి సమయం పడుతుందన్నారు. అప్పటి వరకు నాట్లు ఆపలేమని, రైతన్నలకు తాను ఉన్నానని, కాలువ పూడికతీత పనులు చేపట్టాలని భరోసా ఇచ్చారు. దీంతో ఆయకట్టు రైతులు రెండురోజులుగా జేసీబీ సాయంతో పనులు చేపట్టారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి - పద్మావతి కల్యాణం

రుద్రూర్, మే 18 : రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వర స్వామి – పద్మావతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వరి చెరుకు పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో పద్మావతీ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గన్నారంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ఇందల్వాయి, మే 18 : ఇందల్వాయి మండలంలోని గన్నారంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి – గోవిందమ్మ కల్యాణాన్ని ఆలయ కమిటీ సభ్యులు శనివారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్లపై వాహనాలు పార్క్ చేయొద్దు

రోడ్డుపై ఉన్న వాహనాలను తొలగింపజేస్తున్న సీఐ రమేశ్

ఆర్మూర్‌టౌన్, మే18: కొందరు వాహనదారులు రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్క్ చేస్తున్నారని, తీరు మారకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రమేశ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న వైన్స్ షాపు ఎదుట రోడ్డుపై నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను చూసి వాహనదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై నుంచి వాటిని తొలగింపజేశారు. సీఐ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని అన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

సారంగాపూర్/ సిరికొండ, మే 18 : రూరల్ మండలంలోని మాధవ్‌నగర్, పాల్దా, ముత్తకుంట సొసైటీ కార్యాలయాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్ తెలిపారు. మాధవ్‌నగర్ సొసైటీలో జీలుగ విత్తనాలను ఆమె శనివారం పంపిణీ చేశారు. 60 శాతం సబ్సిడీపై 30 కిలోల బస్తా రూ. 1116కు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాధవ్‌నగర్ సొసైటీ చైర్మన్ దాసరి నాగేశ్వర్‌రావు, ఏఈవో స్వాతిలత, సీఈవో వంశీ కృష్ణ పాల్గొన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని సొసైటీ కార్యా లయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది భూపతిరెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.

NT-327714

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పొతంగల్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా వాసవీమాత జయంత్యుత్సవాలు

సిరికొండ/ధర్పల్లి/కోటగిరి/సుభాష్‌నగర్/రుద్రూర్/వేల్పూర్, మే 18 : జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ఆర్యవైశ్య కులస్తుల ఆధ్వర్యంలో వాసవీ మాత జయంత్యుత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరికొండ మండలంలోని తాళ్లరామడుగులో రామాలయ ఆవరణలో ఉత్సవాలను నిర్వహించారు. ధర్పల్లి మండలకేంద్రంతో పాటు సీతాయిపేట్ గ్రామాల్లో ఆర్యవైశ్యులు వాసతీ మాత చిత్రపటం, మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలో కుంకుమార్చన, అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం, ఊయల సేవ, పల్లకీసేవ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అర్చకుడు వేలేటి గౌరీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ – ఇందూరు శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మపురి పెద్ద రాంమందిరం నుంచి పెద్దబజార్, గాంధీచౌక్, దేవీరోడ్ మీదుగా కిషన్‌గంజ్ వాసవీమాత ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీనగరేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూర్ మండలంలోని పడిగెల్ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి నిర్వహించారు. వాసవీ మాత చిత్రపటానికి పూజలు నిర్వహించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్, మే 18: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొదటి ఫేస్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 నుంచి జూన్ 10 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కోపా కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. వివరాలకు 94945 60090, 99088 99127, 85000 43174లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలు

నవీపేట, మే 18: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిర్వేషన్, మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవీపేట, మే 18: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల మల్కవ్వ(58) శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి భర్తతో ఘర్షణ పడిన మల్కవ్వ అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని మృతి చెందినట్లు చెప్పారు. మల్కవ్వ మృతిపై భర్త మారన్నపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు సాయన్న ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్

రెంజల్, మే 18: మండల తహసీల్ కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. రెంజల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎంఏ ఖలీం సెలవుపై వేళ్లడంతో ఆయన స్థానంలో బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించిన శ్రావణ్‌కుమార్‌కు రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయన అదనపు బాధ్యతలు స్వీకరించారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

రెంజల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెంజల్, మే 18: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన స్కూళ్లలో మౌలిక సదుపాయాలు, మరమ్మతు పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం దూపల్లి, దండిగుట్ట, కూనేపల్లి, కళ్యాపూర్, బాగేపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో రూ.74 లక్షలతో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీరు తదితర పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పీఆర్ డీఈఈ రాజయ్య, ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి, ఏపీఎం చిన్నయ్య, ఏఈఈ వినయ్‌కుమార్, జీపీ కార్యదర్శులు, గ్రామ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, మే18: మండలంలోని పిప్రి జడ్పీ హెచ్ఎస్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఎంపీడీవో సాయిరాం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

పిప్రి పాఠశాలలో..

మహిర 1424 ర్యాంకు

మినహాజ్ 2224 ర్యాంకు

మణికాంత్ 2580 ర్యాంకు

మాలిక్ 3290 ర్యాంకు

రిషిక్ సాయి 4161 ర్యాంకు

అంజుమ్ 4247 ర్యాంకు

ఈఏపీసెట్‌లో 'కాకతీయ' విద్యార్థుల ప్రతిభ

ఖిలీల్‌వాడి, మే 19 : ఈఏపీసెట్ –2024 ఫలితాలు శనివారం వెల్లడించగా.. కాకతీయ కళాశాల విద్యార్థులు ప్రత